సాక్షి నంద్యాల

శుక్రవారం । 7 । జూలై । 2023




శ్రీమఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు గురువారం భక్తులు భారీగా తరలివచ్చారు. దర్శనానికి దాదాపు 2 గంటల సమయం పట్టింది.



జలకళ

కొత్తపల్లి: రెండు రోజులుగా మండలంలో మోస్తరు వర్షం కురుస్తుండటంతో వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి. పొలాలు పదును కావడంతో రైతులు విత్తన పనుల్లో నిమగ్నయ్యారు.



నేడు పదోన్నతుల కౌన్సెలింగ్

కర్నూలు(సిటీ): ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ఎస్జీటీలకు (తెలుగు, ఉర్దూ, కన్నడ) స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు శుక్రవారం డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం



ఆలయ అధికారులకు చెక్కును అందజేస్తున్న విజయవాడకు చెందిన దాత శివరామకృష్ణ

శ్రీశైలంటెంపుల్: దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గురువారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. విజయవాడకు చెందిన శివరామకృష్ణ రూ. పది లక్షలు, కర్నూలుకు చెందిన ఎన్. హనుమంత్ రెడ్డి రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాలను దాతలు ఆలయాధికారులకు వేర్వేరు సమయాల్లో అందజేయగా, వారు దాతలకు దేవస్థానం తరపున స్వామివార్ల శేష వస్త్రాలు, లడ్డుప్రసాదాలు, విరాళాల బాండును అందజేశారు.

హౌసింగ్ ఈఈ నాగరాజుకు రాష్ట్ర స్థాయి అవార్డు



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ఈఈ నాగరాజు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కర్నూలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సి.నాగరాజు రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు. విజయవాడలో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అజయ్‌జైన్, గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీషా పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ జగనన్న కాలనీల్లో పురోగతి చూపిన అధికారులకు అవార్డులను ప్రదానం చేశారు. కర్నూలు డివిజన్‌లో 51 శాతం గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో నాగరాజుకు ఉన్నతాధికారులు మెమొంటో, ప్రశంసా పత్రాన్ని అందించి సన్మానించారు.

దివ్యాంగులకు జాతీయ పురస్కారాలు

కర్నూలు(అర్బన్): జిల్లాలో వివిధ అంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న విభిన్న ప్రతిభావంతులైన అభ్యర్థులకు(దివ్యాంగులు) 2023 జాతీయ పురస్కారాలను అందిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిసా ఫాతిమా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు www.disabilityaffairs.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. అర్హులైన దివ్యాంగ అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దివ్యాంగులకు వ్యక్తిగతంగాను, దివ్యాంగుల సాధికారతకు కృషి చేస్తున్న సంస్థలకు కూడా పురస్కారాలు అందిస్తామన్నారు.

డిగ్రీ ప్రవేశాల దరఖాస్తుకు గడువు పొడిగింపు

కర్నూలు (న్యూసిటీ): నాలుగేళ్ల హానర్స్ డిగ్రీ కోర్సుల్లో మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీ రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ ఎకనామిక్స్, బి.కామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీబీఏ బిజినెస్ అనలిటిక్స్ హానర్స్ కోర్సుల్లో విద్యార్థులు చేరవచ్చని పేర్కొన్నారు. 15 నుంచి 19వ తేదీలోగా విద్యార్థులు వెబ్ ఆప్షన్స్‌లో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీని ఎంపిక చేసుకోవాలని తెలిపారు. 24వ తేదీన సీట్ల కేటాయింపు జరుగుతుందని, ఆరోజు విద్యార్థులు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

కౌలు రైతులు పెట్టుబడి సాయానికి అర్హులే!

కర్నూలు(అగ్రికల్చర్): 2023–24 సంవత్సరానికి సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలు రైతులు వైఎస్ఆర్ రైతుభరోసా కింద పెట్టుబడి సాయం పొందడానికి అర్హులు. కార్డులు పొందిన కౌలుదారులు వెంటనే సంబంధిత రైతుభరోసా కేంద్రాల ఇన్‌చార్జీలను సంప్రదించి అప్‌లోడ్ చేయించుకోవాలని వ్యవసాయ అధికార వర్గాలు తెలిపాయి. సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలుదారులకు ప్రభుత్వమే పెట్టుబడిసాయం పూర్తిగా రూ.13,500 చెల్లించనుంది. సొంత భూమి లేని కౌలుదారులు మాత్రమే ఇందుకు అర్హులని అధికారులు తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి రెండో విడత పెట్టుబడి సాయం అక్టోబర్‌లో రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదల కానుంది. ఇదిలా ఉంటే జిల్లాలో సీసీఆర్‌సీ కార్డుల జారీ ముమ్మరంగా సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా 472 గ్రామాల్లో 9,448 సీసీఆర్‌సీ కార్డులు జారీ అయ్యాయి.

ఉడకని అన్నం.. నీళ్ల చారు.. రుచి లేని కూర.. మెనూలో గుడ్డు మాయం.. గతంలో వసతి గృహం విద్యార్థులకు వడ్డించే భోజనం ఇంత అధ్వానంగా ఉండేది. ప్రభుత్వం మారింది. హాస్టళ్లలో మెనూ కూడా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించేలా చర్యలు తీసుకుంది. ఈ మేరకు డైట్ చార్జీలు పెంచడంతో మెనూ పక్కాగా అమలు చేస్తున్నారు.

వెరీ గుడ్డు మెనూ..

- వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం
- డైట్ చార్జీలు పెంచిన ప్రభుత్వం
- అమలులోకి వచ్చిన కొత్త మెనూ
- జిల్లాలో 88 వసతి గృహాల్లో 8,315 మంది విద్యార్థులు



నంద్యాల బాలికల వసతి గృహంలో భోజనాలు తింటున్న విద్యార్థినులు

నంద్యాల(అర్బన్): పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో ఏర్పాటైన సంక్షేమ వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం అందుతోంది. గత ప్రభుత్వాలు అరకొరగా డైట్ చార్జీలు మంజూరు చేయడంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందక బక్కచిక్కిపోయేవారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసర ధరలు పెరగడం, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచింది. నంద్యాల జిల్లాలో 88 వసతి గృహాల్లో 8,315 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. జూన్ 1 నుంచి డైట్ చార్జీల పెంపు అమలుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో హాస్టల్ అధికారులు పోషకాలతో కూడిన మెనూను విద్యార్థులకు అందిస్తున్నారు. గతంలో ఉన్న మెనూకు అదనంగా మరికొన్ని చేర్చి నూతన మెనూను హాస్టళ్లలో పునః ప్రారంభం చేశారు. వారంలో ఏడు రకాల టిఫిన్లు, వారంలో మూడు చికెన్ కర్రీ, ఉడకబెట్టిన గుడ్డు, రోజూ ఉదయం పాలు, వేరుశనగ చిక్కీ, రాత్రి భోజనం అనంతరం అరటి పండు ఇస్తున్నారు. పాఠశాలల పని దినాల్లో మధ్యాహ్న భోజనం స్కూల్లో ఉంటుండగా, సెలవు రోజుల్లో మధ్యాహ్నం వసతి గృహంలో అన్నం, సాంబారు, గుడ్డు కూర ఇస్తున్నారు. మంచి భోజనంతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతోనే డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచింది. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర సంక్షేమ వసతి గృహాలతో పాటు రెసిడెన్షియల్ పాఠశాలలో 8,315 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్కో వసతి గృహంలో దాదాపు 100 సీట్లు ఉంటాయి. ఈ విద్యాసంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. నూతన మెనూ అమలవుతున్న నేపథ్యంలో ఈ ఏడాది అడ్మిషన్ల సంఖ్య భారీ పెరగనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

చార్జీల పెంపు ఇలా..

కాస్మోటిక్ చార్జీలు 3 నుంచి 6వ తరగతి బాలురకు రూ.110 నుంచి రూ.160, బాలికలకు రూ.110 నుంచి రూ.130, 7 నుంచి 10వ తరగతి చదువుతున్న బాలురకు రూ.125 నుంచి రూ.150, బాలికలకు రూ.160 నుంచి రూ.200, ఇంటర్, ఆపైన విద్యార్థులకు రూ.125 నుంచి రూ.200, విద్యార్థినులకు రూ.160 నుంచి రూ.200కు ప్రభుత్వం పెంచింది. ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థినులకు భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

ప్రీ-మెట్రిక్ వసతి గృహాల్లో దినసరి మెనూ ఇలా..

వారం	అల్పాహారం	మధ్యాహ్న భోజనం	రాత్రి భోజనం
ఆదివారం	పూరి, బఠానీ కుర్మా ఉడకబెట్టిన గుడ్డు	చికెన్ బిర్యానీ, రైతా, గోంగూర చెట్నీ	అన్నం, సాంబారు, పెసరపప్పు, మజ్జిగ
సోమవారం	పులిహోర, పప్పుల పొడి	పాఠశాలలో మధ్యాహ్న భోజనం	అన్నం, గుడ్డు, టమాట కూర, రసం మజ్జిగ
మంగళవారం	ఇడ్లీ, వేరుశనగచెట్నీ	"	తాలింపు అన్నం, చికెన్ కర్రీ, గోంగూర చెట్నీ, గుడ్డు
బుధవారం	జీరారైస్, కూరగాయ	"	అన్నం, గుడ్డు టమాట కూర సాంబారు, మజ్జిగ
గురువారం	ఉప్మా, చెట్నీ	"	అన్నం, బెండకాయ ఫ్రై, గుడ్డు, సాంబారు, మజ్జిగ
శుక్రవారం	పొంగలి, చెట్నీ	"	తాలింపు అన్నం, చికెన్‌కర్రీ గోంగూర చెట్నీ, గుడ్డు, రైతా
శనివారం	ఇడ్లీ, చెట్నీ	"	అన్నం, దొండకాయ కూర, పాలకూర పప్పు, మజ్జిగ

- ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు పాలు
- 8.30 గంటలకు వేరుశనగ చిక్కీ
- వారంలో మూడు రోజులు చికెన్
- ప్రతి రోజూ రాత్రి పూట భోజనం తర్వాత అరటి పండు
- సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనంలో అన్నం, సాంబారు, గుడ్డు కూర

పెరిగిన మెస్ చార్జీల వివరాలు (రూ..)

తరగతి	హాస్టల్ గ్రేడ్	2018లో	2023లో
3–4	ప్రీ మెట్రిక్	1,000	1,150
5–10	ప్రీ మెట్రిక్	1,250	1,400
ఇంటర్	పోస్ట్ మెట్రిక్	1,400	1,600

వసతి గృహాలు	సంఖ్య	విద్యార్థులు
ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు	38	2,994
బీసీ సంక్షేమ వసతి గృహాలు	34	2,821
గిరిజన సంక్షేమ వసతి గృహాలు	16	2,500
మొత్తం	88	8,315

డైట్ పెంపుతో మంచి భోజనం



విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచి మంచి నిర్ణయం తీసుకుంది. పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచడం ద్వారా మాకు మంచి భోజనాలు అందుతుంది. మా లాంటి వారి గురించి ఆలోచిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– రేష్మ, 10వ తరగతి, ప్రభుత్వ సమీకృత బీసీ బాలికల వసతి గృహం, నంద్యాల

పేద విద్యార్థులకు మేలు



ప్రభుత్వం మెస్ చార్జీల పెంపుతో పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. రుచికరమైన భోజనం తిని హాయిగా చదువుకోగలుగుతున్నాం. హాస్టల్‌లో మంచి సౌకర్యాలు కల్పించారు. రుచికరమైన భోజనాలు అందిస్తుండటంతో చదువుపై మరింత శ్రద్ధ పెట్టేందుకు వీలవుతుంది.

– విజయ్‌కృష్ణ, 9వ తరగతి, ఎస్టీ బాలుర వసతి గృహం, ఆత్మకూరు

పోషకాలతో కూడిన భోజనం



జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచింది. నూతన చార్జీలు ఇప్పటికే అమలు అవుతున్నాయి. ఈ విద్యాసంవత్సరం నుంచే విద్యార్థికి కొత్త మెనూతో పోషకాలతో కూడిన భోజనం అందిస్తున్నాం. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలి. – చింతామణి, ఎస్సీ సంక్షేమ, సాధికారత జిల్లా అధికారిణి, నంద్యాల

'జగనన్న సురక్ష' సేవలు మెరుగుపర్చండి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ

నంద్యాల: జగనన్న సురక్ష క్యాంపులతో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం, రీసర్వే, పంచాయతీ రాజ్, వ్యవసాయం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో విజయవాడ కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నంద్యాల కలెక్టర్ చాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, డీఆర్ఓ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, పంచాయతీ రాజ్ ఎస్ఈ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్షకు సంబంధించి వచ్చిన అర్జీలకు టోకెన్లు రైజ్ చేసి వాటికి సర్వీసు రిక్వెస్ట్ రూపంలో నమోదు చేసి అర్జీదారులకు మెరుగైన సేవలు అందజేయాలన్నారు. జగనన్న సురక్ష క్యాంపు నిర్వహణ ఫొటోలు తీసి అప్లోడ్ చేయాలన్నారు. జగనన్నకు చెబుదాంకు సంబంధించి ఎక్కువ శాతం రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యుత్ (ఎనర్జీ), మున్సిపాలిటీ, హోం శాఖలకు నుంచి ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని, పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. డాక్టర్ వైఎస్సార్ పశు సంచార వాహన సేవలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజల నుంచి స్వీకరించి తహసీల్దార్ల దగ్గర పెండింగ్ ఉన్న దరఖాస్తులను క్లియర్ చేసి జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా సంబంధీకులకు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఆడిట్ అంశాలను క్లియర్ చేయాలని కలెక్టర్ జిల్లా పరిషత్ సీఈఓను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పీఎం కిసాన్ ఈ–కేవైసీ అథెంటికేషన్ ఈ నెల 31వ తేదీలోగా పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. రెండో విడత కింద చేపట్టిన రీసర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలన్నారు.

డాక్టర్ ప్రభాకర్‌రెడ్డికి నాటా అవార్డు



కర్నూలు(హాస్పిటల్): వైద్యరంగంలో చేసిన కృషికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్, కార్డియోథొరాసిక్ సర్జరీ హెచ్‌వోడి డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి నాటా ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కించుకున్నారు. టెక్సాస్‌లోని డల్లాస్‌లో ఇటీవల ముగిసిన నాటా కన్వెన్షన్–2023లో సీటీ సర్జరీ విభాగంలో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డిని ఈ అవార్డు వరించింది. కార్డియోథొరాసిక్ సర్జన్‌గా ఆయన చేసిన గుండె, ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలు, అధునాతన పద్ధతిలో నిర్వహించిన గుండె ఆపరేషన్లు, కోవిడ్ సమయంలో అందించిన సూచనలు, సలహాలు తదితర విషయాలను పరిగణనలోకి తీసుకుని తనకు నాటా సభ్యులు ఈ అవార్డు ప్రకటించినట్లు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

- ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి



గాజులపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి

మహానంది: అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్‌షాపుల్లో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఏ మాత్రం ఉపేక్షించేది లేదని ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. మహానంది మండలం గాజులపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రం, రేషన్‌షాపుల్లో గురువారం ఆయన తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనాలు, పోషకాహారం పంపిణీ, పాల పంపిణీ విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. గుడ్లు ఎక్కువగా నిల్వ ఉండటంపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. డీలర్లు, ఎండీఎం ఆపరేటర్లు బాధ్యతగా పనిచేసి ప్రజలకు రేషన్ సరుకులు అందించాలని సూచించారు. ధరలకు సంబంధించిన ఫ్లెక్సీలను వాహనాల్లో ఏర్పాటు చేయాలన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు

- వైఎస్ఆర్ పీటీడీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య



మాట్లాడుతున్న చల్లా చంద్రయ్య

కర్నూలు(రాజ్‌విహార్): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగుల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని వైఎస్ఆర్ పీటీడీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య అన్నారు. గురువారం స్థానిక బిర్లాగేట్ వద్ద ఉన్న వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాల ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా చల్లా చంద్రయ్య మాట్లాడారు. సంస్థ ఏర్పడినప్పటి నుంచి కార్మికులకు ఉద్యోగ భద్రత లేదన్నారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అలవెన్స్‌లు వర్తింపజేశారన్నారు. రూ.6,700 కోట్ల అప్పులు భర్తీ చేయడంతో పాటు రూ.12 వేల కోట్లు జీతభత్యాల కోసం ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎస్పీ రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఆర్టీసీ ఉద్యోగులకు జీపీఎస్ అమలవుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు సంవత్సరాల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ త్వరలో చెల్లిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీఎస్ఎస్ రెడ్డి, కార్యదర్శి నాగన్న, జోనల్ కార్యదర్శులు రాఘవ్, ఉమామహేశ్వరరెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రభుదాస్, రాబర్ట్, ప్రచార కార్యదర్శి ఎంబీఎల్ శాస్త్రి, నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఆచారి, శేషన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): జూలై నెలకు సంబంధించి వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ ముగిసింది. నంద్యాల జిల్లాలో 2,14,261 పింఛన్లు ఉండగా.. 2,12,670 మందికి రూ.58.69 కోట్లు పంపిణీ చేశారు. పంపిణీ 99.26 శాతం పూర్తి కాగా.. జిల్లా రాష్ట్రంలో 4వ స్థానంలో నిలిచింది. జిల్లా స్థాయిలో బనగానపల్లి మండలం, అర్బన్ ప్రాంతాల్లో బేతంచెర్ల మున్సిపాలిటీ మొదటి స్థానం దక్కించుకున్నాయి. కర్నూలు జిల్లాలో 2,36,773 పింఛన్లు ఉండగా.. 2,34,991 మందికి రూ.65.33 కోట్లు పంపిణీ చేశారు. పంపిణీ 99.25 శాతం పూర్తి కాగా.. జిల్లా రాష్ట్రంలో 5వ స్థానంలో నిలిచింది.

రెండో రోజూ కొనసాగిన ఏసీబీ తనిఖీలు



ఫైళ్లను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన పలు ఇంజినీరింగ్ పనులపై రెండో రోజు కూడా ఏసీబీ అధికారుల తనిఖీ చేశారు. గురువారం దేవస్థానం పరిపాలనా భవనంలోని సమీక్ష సమావేశ మందిరంలో ఏసీబీ డిప్యూటీ ఇంజినీర్ రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో ఇంజినీరింగ్ పనులకు సంబంధించిన ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా పనులకు సంబంధించి ఎంబుక్ తదితర వివరాలను పరిశీలించారు. ఏసీబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వంశీనాథ్ నేతృత్వంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆలయ మాడవీధులు , ఔటరింగ్‌రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వాటర్ సిస్టమ్, పుష్కరిణి, శివాజీ గోపురం తదితర పనులను క్షేత్ర స్థాయిలో ఏసీబీ ఇంజినీరింగ్ సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించారు. దేవస్థానంలో జరిగిన అభివృద్ధి పనులలో ఏమైనా అవకతవకలు జరిగాయోమోనని కూలంకుషంగా పరిశీలించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ తనిఖీలు గురువారంతో ముగిశాయి. గతంలో పనిచేసిన ఇంజినీర్లను పిలిపించి ఆయా పనులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరో 10 రోజుల్లో మరో సారి ఏసీబీ అధికారులు క్షేత్రానికి చేరుకుని ఆయా పనులపై తనిఖీ నిర్వహించనున్నారు. అనంతరం నివేదికను ప్రభుత్వానికి అందించనున్నట్లు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.

వెనుకబడిన విద్యార్థికి సువర్ణ అవకాశం

- పది, ఇంటర్ ఫెయిల్ అయినా రెగ్యులర్ తరగతులకు అనుమతి
- మళ్లీ అదే కోర్సుల్లో చేరేందుకు ప్రభుత్వ నిర్ణయం
- వలంటీర్ల ద్వారా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్



చాపిరేవుల ఉన్నత పాఠశాల

నంద్యాల(న్యూటౌన్): సమాజంలో అసమానతలను చదువుతోనే రూపుమాపగలమనే లక్ష్యంతో విద్యారంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వినూత్న సంస్కరణలు తీసుకొస్తున్నారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తున్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయి చదువులు అభ్యసించాలన్నా.. మెరుగైన జీవనోపాధి పొందాలన్నా పది, ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత తప్పని సరి. ఏదైన కారణాలతో పది, ఇంటర్ గట్టెక్కక పోతే తల్లిదండ్రులు చదువు మాన్పించేస్తారు. కుమారులను వ్యవసాయం, చేతి వృత్తి, కూలీ పనులకు పంపుతారు. కుమార్తెలను ఇంటి పనులు చేయించడం, ఏదైన సంబంధం వస్తే పెళ్లి చేసి పంపుతారు. ఈ సమస్యను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చదువులో వెనుకబడి సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ అయినా విద్యార్థులు మళ్లీ అదే తరగతులకు హాజరై పరీక్షలు రాసేలా చర్యలు తీసుకుంది. రెగ్యులర్ తరగతుల్లో అదే కోర్సుల్లో చేరేందుకు అనుమతించి మళ్లీ చదువుకోవడానికి అవకాశం కల్పించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా పేదల విద్యాభివృద్ధికి జగనన్న ప్రభుత్వం పాటు పడుతుంది. ఈ మేరకు 'మిషన్ విజన్' పేరుతో ఈ ఏడాది ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను వలంటీర్ల ద్వారా అమలు చేయనుంది. జిల్లాలో టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు 9 వేల మంది, ఇంటర్మీడియెట్‌లో 10 వేల మంది వరకు ఉన్నట్లు అధికారిక సమాచారం. వీరిని వలంటీర్లు గుర్తించి పాఠశాలలు, కళాశాలలో చేర్పించే విధంగా విద్యాశాఖ చర్యలు తీసుకుంటుంది. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు తిరిగి రెగ్యులర్ తరగతుల్లో చదువుకోవడానికి ప్రభుత్వం అవకావం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. రెగ్యులర్ విద్యార్థులకు ఏ విధంగా విద్యాబోధన ఉంటుందో ఫెయిల్ అయిన విద్యార్థులు అలాగే ఉంటుంది. ఫెయిల్ అయిన వారు నిరాశ చెంది చదువు మానేయకుండా తిరిగి రెగ్యులర్ తరగతుల్లో చేరి ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కాగా అమ్మఒడి, విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన పథకాల వర్తింపుపై ఇప్పటి వరకు గైడ్‌లెన్స్ రాలేదు.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

ఏటీఎం మాయగాడు దొరికాడు


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట రామయ్య

ఆళ్లగడ్డ: ఏటీఎం కేంద్రాల వద్ద కార్డుదారులను బురిడీ కొట్టించి నగదు అపహరిస్తున్న దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం డీఎస్పీ వెంకటరామయ్య విలేకరుల సమావేశంలో వివరాలను వివరించారు. మండలంలోని నల్లగట్ల గ్రామానికి చెందిన శూలం సుబ్బగుర్రప్ప అనే వ్యక్తి బుధవారం బస్టాండు సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో నగదు తీసుకుంటుండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి సాయం చేసినట్లుగా నటించి పిన్ నంబర్ తెలుసుకొని అతని వద్దనున్న నకిలీ ఏటీఎం కార్డును తనకిచ్చి ఒరిజినల్ కార్డును తీసుకున్నాడు. అనంతరం ఆ కార్డును ఉపయోగించి రూ.60,500 నగదు విత్‌డ్రా చేశాడు. దీంతో బాధితుడు వెంటనే పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు 24 గంటల్లోనే మహారాష్ట్రకు చెందిన సంభాజి గోవిందు అనేవ్యక్తిని అరెస్టు అతని వద్ద ఉన్న రూ.60,500 నగదుతోపాటు ఓ ద్విచక్రవాహనం, ఏటీఎంకార్డు, సెల్‌ఫోన్, ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకున్న 24 గంటల్లోనే ఛేదించిన సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐ వెంకరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వరరావు, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, మదార్ వలిను డీఎస్పీ అభినందించారు.

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): డిప్లొమా ఇన్ పారామెడికల్ కోర్సులకు ఇంటర్‌మీడియట్ బైపీసీ అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఈ నెల 24వ తేదిలోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల కార్యాలయంలో రూ.100 రుసుము చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పూర్తిగా పూరించకపోతే ఎలాంటి సమాచారం లేకుండానే తిరస్కరిస్తామన్నారు. పోస్టు ద్వారా వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని తెలిపారు. దరఖాస్తులను www.appmb.com.in/ apsahpc.co.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పారామెడికల్ కోర్సుల కౌన్సెలింగ్ ఆగస్టు ఒకటో తేదీన నిర్వహిస్తామన్నారు.

వ్యక్తిపై కత్తులతో దాడి

ఆళ్లగడ్డ: శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామానికి చెందిన రఘునాథరెడ్డిపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. ఆళ్లగడ్డలో ప్రైవేటు ఉద్యోగం చేసే ఇతను బుధవారం రాత్రి 11 గంటలకు విధులు ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. కారులో వెంబడిస్తూ వచ్చిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఎర్రగుంట్ల సమీపంలో బైక్‌ను అటకాయించారు. రఘునాథరెడ్డి తేరుకునేలోపే కత్తులు, రాడ్లతో విచక్షణా రహితంగా దాడి చేసి అక్కడి నుంచి పారిపోయారు. తీవ్రంగా గాయపడి రోడ్డు పక్కన పడి ఉన్న రఘునాథరెడ్డిని వాహనదారులు గుర్తించి 108లో నంద్యాల వైద్యశాలకు తరలించారు. కాగా పోలీసుల విచారణలో తనపై ఎవరు దాడి చేశారో, ఎందుకు దాడిచేశారో తెలియదని రఘునాథరెడ్డి చెప్పడంతో పాటు కేసు కూడా నమోదు చేయవద్దని అంటుండటంతో పోలీసులు అనుమానిస్తున్నారు. అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని సీఐ చంద్రబాబునాయుడు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి


- ఆటో ప్రమాదంలో ముగ్గురికి చేరిన మృతుల సంఖ్య


ఆత్మకూరురూరల్: మూడు రోజుల క్రితం ఆత్మకూరు పట్టణ సమీపంలో ఆటో, లారీ ఢీకొన్న ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంజీవనగర్ తండాకు చెందిన దేరంగుల సుబ్బమ్మ(65) గురువారం మృతి చెందింది. ఈ ప్రమాదంలో కర్నూలుకు చెందిన తండ్రి, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా దేరంగుల సుబ్బమ్మ(65) చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందింది.


రెండు డ్రైవర్, ఒక డాక్టర్ పోస్టు ఖాళీ

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ సంచార పశు వైద్య రథాలకు సంబంధించి రెండు డ్రైవర్ పోస్టులు, ఒక డాక్టర్ పోస్టు ఖాళీగా ఉందని ఈఎంఆర్ఐ–జీహెచ్ఎస్ జిల్లా మేనేజర్ రామకృష్ణగౌడు తెలిపారు. క్రిష్ణగిరి లొకేషన్‌లోని వెటర్నరీ అంబులేటరీ సర్వీస్‌కు సంబంధించి రెగ్యులర్ డ్రైవర్ పోస్టు, కర్నూలు లొకేషన్‌కు సంబంధించి రిలీవర్ డ్రైవర్ పోస్టు ఖాళీగా ఉందన్నారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు అర్హులని తెలిపారు. నెలకు రూ.10,800 వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు ఉంటాయన్నారు. ఆదోని మండలం మదిర–3 లొకేషన్‌కు సంబంధించి డాక్టర్ పోస్టు ఖాళీగా ఉందని, బీవీఎస్‌సీ పూర్తి చేసిన వారితో పాటు విశ్రాంత పశువైద్యులు అర్హులన్నారు. నెలకు రూ.40 వేల వేతనం లభిస్తుందన్నారు.


నంది విగ్రహం నోట్లో నుంచి జాలువారుతున్న నీటి ధార


ఆలయ సమీపంలోని పుష్కరిణి వద్ద మునులు తపస్సు ఆచరించిన ప్రాంతం


పుష్కరిణిలో చిన్నారుల కేరింత


యాగంటి క్షేత్ర విహంగ వీక్షణం..కనువిందు చేసే ఒంపులు తిరిగిన రోడ్డు


ప్రకృతి చెక్కిన పరమాద్భుతం


యాగంటి బసవేశ్వరుడు

మురిపించే ఎర్రరాళ్ల సోయగం.. శిల్పి ఉలితో శ్రద్ధగా చెక్కినట్లు కొండల సౌందర్యం.. ఊహా ప్రపంచాన్ని తలదన్నేలా అద్భుత నిర్మాణం.. యాగంటి ఉమామహేశ్వరాలయం ప్రకృతి చెక్కిన పరమాద్భుతం.. పురాతనను అద్దుకున్న విశిష్ట క్షేత్రం..శివ,కేశవులు ఇద్దరూ కొలువై ఉన్న పరమ పవిత్ర ప్రాంతం. లేచి రంకె వేయడానికి సిద్ధంగా ఉన్నట్లు, జీవకళ ఉట్టిపడుతూ రోజురోజుకూ పెరుగుతున్న బసవేశ్వరుడిని ఇక్కడ చూసి తీరాల్సిందే. కొండకోనల్లో నుంచి వచ్చే జలధార ఏడాదిపొడువునా నంది విగ్రహం నోటి నుంచి కోనేరులోకి దూకడం ఆశ్చర్యంగా కనిపిస్తుంది. కోనేటి నీటికి ఔషధ గుణాలు ఉన్నాయని, ఇక్కడ స్నానం చేస్తే ఆరోగ్యం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. సహజ సిద్ధమైన గుహలు.. వాటి ప్రాశస్త్యం తెలుసుకోవాల్సిందే! ఇక్కడే అగస్త్య మహాముని, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తపస్సు చేశారని స్థలపురాణం చెబుతోంది. ఎత్తయిన కొండలు.. ఇటీవల కురిసిన వర్షాలకు పరుచుకున్న పచ్చదనం.. శివుని మెడలో పాములా కనిపించే తారు రోడ్డు.. ఆకాశాన్ని అందుకుంటుందా అన్నట్లు ఉండే గాలి గోపురం.. ఇలా ఎన్నో విశేషాల యాగంటి దర్శనం ఆహ్లాదాన్ని, ఆధ్యాత్మిక అనుభూతిని పంచుతోంది.

– ఫొటోలు: డి.హుస్సేన్


వీరబ్రహ్మేంద్రస్వామి తపస్సు చేసిన ప్రాంతం


గాలిగోపురం అందాలను తిలకిస్తున్న భక్తులు


వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్న గుహ


గుడి వెనుక ఎత్తయిన కొండమీద గరుడ దీపం

గంజాయిపై పోలీసుల స్పెషల్ డ్రైవ్

- వారం రోజుల్లో 43 కేజీల గంజాయి స్వాధీనం
- 36 మంది అరెస్ట్, మరికొందరు పరారీ


గంజాయి విక్రేతల అరెస్ట్ చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: గంజాయి విక్రయాలపై జిల్లా పోలీసులు కొరఢా ఝులిపించారు. జిల్లాలో గంజాయి తరలింపు..విక్రయాలను అరికట్టేందుకు ఎస్‌బీ, సెబ్, సివిల్ పోలీసులు నిఘా వేసి 43 కేజీల గంజాయితో పాటు 36 మంది నిందితులను గురువారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ తూర్పు ఏజెన్సీ ప్రాంతాల నుంచి వివిధ మార్గాల ద్వారా జిల్లాకు గంజాయి తరలింపు జరుగుతున్న నేపథ్యంతో పోలీసులను అప్రమత్తం చేశామన్నారు. గత వారం రోజుల్లోనే నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో 15 మంది నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి 11.45 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అలాగే ఆత్మకూరు సబ్‌డివిజన్ పరిధిలో 22 మంది నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి 28.40 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో ఇద్దరి నుంచి 1.20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. డోన్ సబ్‌డివిజన్ పరిధిలో ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి 2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అరెస్ట్ చేసిన నిందితుల్లో 15 మంది గంజాయి విక్రయించే వ్యాపారులు ఉండగా గంజాయిని తూర్పు ఏజెన్సీ నుంచి సరఫరా చేసిన వారు ముగ్గురు ఉన్నారన్నారు. గంజాయి వినియోగించే 18 మందిని కేసులో నిందితులుగా చేర్చామన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, రూరల్ సీఐ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుల అరెస్ట్..

నంద్యాల పట్టణం పీవీ నగర్‌కు చెందిన వెంకటలక్ష్మమ్మ, వెంకటరమణ, వెంకటకుమార్, ఖాజావలి, యుగంధర్, బాలనాగన్న, నాగస్వామి నాయక్ అనే 7 మంది నిందితులు 6.50 కేజీల గంజాయిని బుధవారం తరలిస్తుండగా తాలుకా పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

మట్కా కేసులో 76 మంది అరెస్ట్..

జిల్లాలో మట్కా నిర్వాహకులపై ఎస్పీ ఆదేశాల మేరకూ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వారం రోజుల్లో మట్కా నిర్వాహకులపై 33 కేసులు నమోదు చేసి 76 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో 69 మంది మట్కా బీటర్లు ఉండగా 7 మంది నిర్వాహకులు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు.

దంపతుల ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం
- అనాథలైన ముగ్గురు చిన్నారులు
- శ్రీరంగాపురంలో విషాదం



మృతి చెందిన గౌరిగాళ్ల వెంకటేశ్వర్లు, శిరీష

రుద్రవరం: కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రుద్రవరం మండలంలో శ్రీరంగాపురం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బండిఆత్మకూరు మండలం పరమటూరు గ్రామానికి చెందిన శిరీష(26)ను శ్రీరంగాపురం గ్రామానికి చెందిన గౌరిగాళ్ల వెంకటేశ్వర్లు (32)తో ఎనిమిదేళ్ల క్రితం పెద్దలు పెళ్లి చేశారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. కొంత కాలంగా శిరీష కడుపు నొప్పితో బాధ పడుతూ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంది. కుటుంబ పోషణ, ఆసుపత్రుల ఖర్చుల నిమిత్తం భర్త వెంకటేశ్వర్లు దాదాపు రూ.3లక్షల వరకు అప్పు చేశాడు. ఆస్తులు లేకపోవడం అప్పులు పెరుగుతుండటంతో భార్యాభర్తల మధ్య వాగ్వాదం నెలకొంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి వారి మధ్య గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శిరీష ఇంట్లో ఎవరూ లేని సమయంలో రసాయన ద్రావణాన్ని తాగింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను బంధువులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆమె భర్త కూడా జీవితంపై విరక్తి చెంది గురువారం ఉదయం ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతురాలి తల్లి నాగలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించినట్లు ఏఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు.


అనాథలైన ముగ్గురు చిన్నారులు

అమ్మానాన్నా.. మాకెవ్వరు దిక్కు..

తల్లిదండ్రుల ఆత్మహత్యతో వారి పిల్లలు అనాథగా మిగిలారు. పోస్టుమార్టం అనంతరం ఇద్దరి మృతదేహాలను అంత్యక్రియల నిమిత్తం గ్రామానికి ట్రాక్టర్‌లో తీసుకొచ్చారు. శిరీష, వెంకటేశ్వర్లు మృతదేహాల వద్ద కుమారులు నరసింహ, ధనుష్, కుమార్తె ఇందుమతి రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించకుండా దంపతులు ఆత్మహత్యకు పాల్పడటంతో వారి ఆలనా పాలనా ఎవరు చూడాలంటూ చర్చించుకున్నారు.

క్లుప్తంగా

డీసీఎంఎస్ బ్రాంచ్‌ల ద్వారా ఎరువుల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ సేవలను మరింత విస్తరించాలని చైర్ పర్సన్ సీహెచ్ శిరోమణి మద్దయ్య తెలిపారు. గురువారం ఆమె కొండారెడ్డిబురుజు సమీపంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 18 బ్రాంచ్‌లలో ఈ ఖరీఫ్ నుంచి రైతులకు ఎరువుల పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. 4–5 రోజుల్లో ఎరువులు సరఫరా చేస్తామన్నారు. మారుమూల గ్రామాల రైతులకు కూడా సేవలు అందించేందుకు త్వరలో కొత్త బ్రాంచీలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ రాజేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతి చెందిన రాజేష్

రుద్రవరం: హరినగరం సమీపంలో విద్యుదాఘాతానికి గురై రాజేష్ (22)అనే యువకుడు మృతి చెందాడు. తెలుగుగంగ 24వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వ మరమ్మతులను కాంట్రాక్టర్ పూర్తి చేయగా కొలతలు వేసేందుకు అధికారులు గురువారం వెళ్లారు. వారి వెంట శిరివెళ్ల మండలం గోవిందపల్లెకు చెందిన గడ్డం రాజేష్ అల్యూమినియం కొలత బద్దను మోసుకెళ్తున్నాడు. ఓ చోట బురద ఉండటంతో ఎత్తుగా ఉన్న కొలత బద్దను అలాగే చేత పట్టుకొని కాల్వ కట్టపైకి చేరుకోగానే ప్రమాదవశాత్తుపై భాగాన ఉన్న విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఏఎస్‌ఐ భూపాల్‌రెడ్డి తెలిపారు.

ఉద్యోగ సాధనే లక్ష్యంగా చదవాలి

- అనుకున్నది సాధించే వరకు విశ్రమించరాదు
- అమిగోస్ 21 సెంచురీ ఐఏఎస్ సెంటర్ ఫ్యాకల్టీ ఆకెళ్ల రాఘవేంద్ర


మాట్లాడుతున్న ఆకెళ్ల రాఘవేంద్ర

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగ సాధనే లక్ష్యంగా యువత చదువును కొనసాగించాలని హైదరాబాద్‌కు చెందిన అమిగోస్ 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ సీనియర్ ఫ్యాకల్టీ ఆకెళ్ల రాఘవేంద్ర సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జిల్లా గ్రంథాలయసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థి, యువత–లక్ష్యాల సాధన అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు ఆయనతోపాటు జిల్లాకు చెందిన విద్యావేత్తలు ఆదిమూలపు సతీష్, కేవీ సుబ్బారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆకెళ్ల రాఘవేంద్ర మాట్లాడుతూ.. అనుకున్న లక్ష్యం నెరవేరే వరకు విశ్రమించరాదన్నారు. ఉద్యోగం కోసం ఏడాది కష్టపడి చదివితే ఆ తరువాత సుఖంగా జీవించవచ్చన్నారు. రానున్న రెండు, మూడు నెలల్లో గ్రూపు–1, 2, 4తోపాటు డీఎస్సీ, ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌లు వచ్చే అవకాశం ఉందన్నారు.

ప్రతి నియోజకవర్గంలో సెమినార్లు

విద్యార్థి, యువత– లక్ష్యాల సాధన సెమినార్లను ప్రతి నియోజకవర్గంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాస్ చంద్రబోస్ తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారిలో ఉన్న అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను సాధించడం కోసం యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు సీహెచ్ మద్దయ్య, దేవపూజ ధనుంజయాచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య , గాయకుడు మియ్యా పాల్గొన్నారు.


అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులు